
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

సిద్దిపేట 5

ఆదివారం 17 మార్చి 2024



రంజాన్ వేళలు

ఇఫ్తార్ : ఆదివారం సాయంత్రం: 6.32 గం.

సహర్ : సోమవారం ఉదయం: 5.00 గం.

భగ్గుమన్న బీఆర్ఎస్

- కవిత అరెస్టుకు నిరసనగా బీఆర్ఎస్ శ్రేణుల ఆందోళన
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రాస్తారోకోలు, ర్యాలీలు
- పాల్గొన్న ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, కార్యకర్తలు



సిద్దిపేటలో బీఆర్ఎస్ నాయకులను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, మార్చి 16: లిక్కర్ స్కాం కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితను ఈడీ అక్రమంగా అరెస్టు చేసిందని ఆ పార్టీ నాయకులు విమర్శించారు. ఆ పార్టీ అధిష్ఠానం పిలుపు మేరకు శనివారం ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా పార్టీ శ్రేణులు ఆందోళనలు నిర్వహించారు. ఇందులో భాగంగా అన్నీ నియోజకవర్గ కేంద్రాలు, మండల కేంద్రాల్లో ర్యాలీలు, రాస్తారోకోలు చేపట్టారు. నిరసనలో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు ఈడీ డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. ఈ నిరసనల్లో పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు ఇతర ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. సిద్దిపేటలో బీఆర్ఎస్ శ్రేణులు అంబేడ్కర్ చౌరస్తా వద్ద ధర్నా, రాస్తారోకో చేపట్టడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. గజ్వేల్‌లో అంబేడ్కర్ చౌరస్తా వద్ద చేపట్టిన ఆందోళనలో ఎమ్మెల్సీ యాదవరెడ్డి, అటవీ అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ ప్రతా‌ప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. మండల కేంద్రమైన భూంపల్లిలో నిర్వహించిన ఆందోళనలో దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు. మండల కేంద్రమైన మద్దూరులో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను, మండలకేంద్రమైన అక్కన్నపేట అంబేడ్కర్ చౌరస్తా వద్ద ప్రధాని మోదీ దిష్టిబొమ్మను బీఆర్ఎస్ కార్యకర్తలు దహనం చేశారు.

సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో

సంగారెడ్డిలో ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు కొత్త బస్టాండ్ వద్ద నల్ల కండువాలు ధరించి రాస్తారోకో నిర్వహించారు. జహీరాబాద్‌లో ఎమ్మెల్యే మాణిక్‌రావు నాయకత్వంలో డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్, జహీరాబాద్ పార్లమెంట్ అభ్యర్థి అనిల్‌కుమార్ తదితరులు ప్రధాన రహదారిపై రాస్తారోకో చేపట్టారు. పటాన్‌చెరులో కార్పొరేటర్ కుమార్‌యాదవ్‌తో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు జాతీయ రహదారిపై బైఠాయించారు. నారాయణఖేడ్‌లో మాజీ ఎమ్మెల్యే ఎం.భూపాల్ రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు ర్యాలీగా వచ్చి రాస్తారోకో నిర్వహించారు. జోగిపేటలో మాజీ ఎమ్మెల్యే క్రాంతి ఆధ్వర్యంలో రాస్తారోకో చేపట్టారు. మెదక్‌లో మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి నాయకత్వంలో రాందాస్ చౌరస్తా నుంచి అంబేడ్కర్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. నర్సాపూర్‌లో ఎమ్మెల్యే సునితారెడ్డి నాయకత్వంలో పార్టీ కార్యకర్తలు రహదారిపై బైఠాయించారు. కాగా తూప్రాన్‌లో ఎలాంటి ఆందోళనలు చేయకపోవడం గమనార్హం.



దుబ్బాకలో బీఆర్ఎస్ నాయకులతో కలిసి నిరసన తెలుపుతున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

కోడ్ కూసింది

పార్లమెంట్ ఎన్నికలకు మోగిన నగారా

షెడ్యూల్ విడుదల చేసిన కేంద్ర ఎన్నికల సంఘం

- రాత్రి 10 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు ప్రచారం బంద్
- ఎంపీ అభ్యర్థి ప్రచార ఖర్చు పరిమితి రూ.95 లక్షలు
- ప్రభుత్వ పథకాల ప్రచార పోస్టర్ల తొలగింపు ప్రక్రియ షురూ
- మే 13 న పోలింగ్, జూన్ 4న కౌంటింగ్



ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి/మెదక్, మార్చి 16 : పార్లమెంట్ ఎన్నికల కోడ్ వచ్చేసింది. ఎన్నికల షెడ్యూలును శనివారం ప్రకటించగా తక్షణమే కోడ్ అమలులోకి వస్తుందని ఎన్నికల సంఘం ప్రకటించింది. మెదక్, జహీరాబాద్ పార్లమెంట్‌కు ఏప్రిల్ 18న ఎన్నికల నోటిఫికేషన్ వెలువడనున్నది. ఆరోజు నుంచే నామినేషన్ల ప్రక్రియ మొదలు కానున్నది. ఏప్రిల్ 25న నామినేషన్ల స్వీకరణ ముగియనున్నది. 26న పరిశీలన, 29 వరకు ఉపసంహరణకు గడువుగా నిర్ణయించింది. మే 13న ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ జరగనున్నది.

ప్రచార పరిమితి రూ.95 లక్షలు

పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ప్రచార ఖర్చుగా రూ.95 లక్షలను ఎన్నికల సంఘం పరిమితి విధించింది. ఇందుకు సంబంధించి అభ్యర్థులు చేసే ప్రచార ఖర్చులను ఎప్పటికప్పుడు ఎన్నికల పరిశీలకులు, వ్యయపరిశీలకులు పరిశీలించనున్నారు. వీరితో పాటు ఎన్నికల సంఘం నియమించిన ఫ్లయింగ్ స్క్వాడ్స్, స్టాటిక్ సర్వేలెన్స్, వీడియో సర్వేలెన్స్ తదితర బృందాలు పరిశీలించనున్నాయి. అభ్యర్థుల ప్రచార ఖర్చును ఎన్నికల సంఘం నియమించిన వ్యయబృందాలతో ఆడిట్ చేయించుకోవాల్సి ఉంటుంది.

మెదక్ పార్లమెంట్ నియోజకవర్గంలో ఓటర్లు

మొత్తం ఓటర్లు	18,12,858
పురుషులు	8,95,777
మహిళలు	9,16,876
ఇతరులు	205

ప్రజావాణి రద్దు...

లోక్‌సభ ఎన్నికల షెడ్యూలు వచ్చినందున, ఎన్నికల నిబంధనల మేరకు ప్రతీ సోమవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్టు కలెక్టర్ మనుచౌదరి ప్రకటనలో తెలిపారు. ఎన్నికల కోడ్ ముగిసే వరకు ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించడం జరగదని, జిల్లా ప్రజలు గమనించగలరని కలెక్టర్ కోరారు.



సంగారెడ్డి కలెక్టరేట్ మెయిన్ గేట్ వద్ద ప్రభుత్వ ప్రచార పోస్టర్‌ను తొలగిస్తున్న సిబ్బంది



సంగారెడ్డి చౌరస్తాలోని ఎన్‌టీఆర్ విగ్రహానికి ముసుగేస్తున్న సిబ్బంది

గుర్తింపు కార్డుతోనే ఓటు

ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునేందుకు 12 రకాల గుర్తింపు కార్డులను ఎన్నికల సంఘం అనుమతిచ్చింది. ఇందులో ఏదో ఒక కార్డును చూపించి ఓటర్లు ఓటేయాల్సి ఉంటుంది. గుర్తింపు కార్డుల్లో ఆధార్, ఉపాధిహామీ జాబ్‌కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, పాన్‌కార్డు, పాస్‌పోర్టు, ఫొటోతో ఉన్న పెన్షన్ కార్డు, బ్యాంకు, పోస్టాఫీసు పాస్‌బుక్ తదితర కార్డులను ఎన్నికల సంఘం అనుమతించింది.

మెదక్ పార్లమెంట్ పరిధిలో అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా ఓటర్లు

అసెంబ్లీ	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
సిద్దిపేట	1,16,042	1,20,361	71	2,36,474
మెదక్	1,03,654	1,13,089	5	2,16,748
నర్సాపూర్	1,09,806	1,16,342	6	2,26,154
సంగారెడ్డి	1,22,021	1,25,284	33	2,47,338
పటాన్‌చెరు	1,97,557	2,09,757	85	4,07,419
దుబ్బాక	96,867	1,02,369	0	1,99,236
గజ్వేల్	1,37,630	1,41,854	5	2,79,489
మొత్తం	8,95,777	9,16,876	205	16,35,042

మెదక్ పార్లమెంట్ పరిధిలో 2,098 పోలింగ్ కేంద్రాలు

మెదక్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలో 2,098 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. సెగ్మెంట్‌ల వారీగా సిద్దిపేటలో 273, మెదక్‌లో 274, నర్సాపూర్‌లో 305, సంగారెడ్డిలో 281, పటాన్‌చెరులో 391, దుబ్బాకలో 253, గజ్వేల్‌లో 321 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు.

మెదక్ ఆర్వోగా కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్ పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా ఆ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ వ్యవహరించనున్నారు. ఈ పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లకు ఆర్డీవోలను అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులుగా నియమించారు. దుబ్బాక సెగ్మెంట్‌కు సిద్దిపేట అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్, పటాన్‌చెరుకు సంగారెడ్డి జిల్లా మైనారిటీ అధికారి ఏఆర్వోగా వ్యవహరిస్తారు. మిగిలిన సెగ్మెంట్లకు ఆర్డీవోలు ఏఆర్వోలుగా పనిచేస్తారు.

నిబంధనల మేరకు ఆర్వోలు పనిచేయాలి

- కలెక్టర్ మనుచౌదరి సూచన



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మనుచౌదరి, అదనపు డీసీపీ మల్లారెడ్డి

సిద్దిపేట అగ్రికల్చర్, మార్చి 16: లోక్‌సభ ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన నేపథ్యంలో శనివారం కలెక్టర్, ఎన్నికల అధికారి మనుచౌదరి జిల్లా అదనపు కలెక్టర్, దుబ్బాక ఆర్వో గరిమా అగ్రవాల్‌తో కలిసి కలెక్టర్ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఎన్నికల సంఘం నిబంధనల మేరకు ఆర్వోలు పనిచేయాలని ఆయన సూచించారు. ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా ఎన్నికలను విజయవంతంగా నిర్వహిస్తామని కలెక్టర్ తెలిపారు. ఎన్నికల నోడల్ అధికారులను నియమించి, శిక్షణ కూడా ఇచ్చామని తెలిపారు. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినందున ప్రభుత్వ కార్యాలయాలు, సంస్థలలో ప్రభుత్వానికి సంబంధించిన ఉన్న పోస్టర్లను గంటల్లోగా తొలగించాలని సూచించారు. ప్రభుత్వ సంస్థలకు 48 గంటలు, ప్రైవేటు సంస్థలకు 72 గంటల సమయంలోగా తొలగించాలని అధికారులను ఆదేశించారు. ఎన్నికలకు సంబంధించిన కార్యక్రమాల నిర్వహణకు సువిధ పోర్టల్ ద్వారా అనుమతులు పొందాలని ఆయన తెలిపారు.

జిల్లాలో 9.61 లక్షల ఓటర్లు

జిల్లాలోని హుస్నాబాద్, సిద్దిపేట, దుబ్బాక, గజ్వేల్ శాసనసభ నియోజకవర్గాల పరిధిలో 9,61,361 మంది ఓటర్లు ఉన్నారని కలెక్టర్ తెలిపారు. అందులో ఎన్నారై ఓటర్లు 247, సర్వీస్ ఓటర్లు 452 మంది ఉన్నారని చెప్పారు. మెదక్ లోక్‌సభ పరిధిలో జిల్లాలో దుబ్బాక, సిద్దిపేట, గజ్వేల్ శాసనసభ నియోజకవర్గాలు ఉన్నాయని తెలిపారు. కరీంనగర్ లోక్‌సభ పరిధిలో హుస్నాబాద్ నియోజకవర్గం, భువనగిరి లోక్‌సభ పరిధిలో జనగామ శాసనసభ పరిధిలోని 4 మండలాలు ఉన్నాయని కలెక్టర్ తెలిపారు.

64 సమస్యాత్మక ప్రాంతాలు

జిల్లాలో 64 సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించినట్లు అదనపు డీసీపీ మల్లారెడ్డి వెల్లడించారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లా పరిధిలో 11 ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, 13 ఎస్ఎస్‌టీ బృందాలు, 26ఎంసీసీ బృందాలు, 103 రూట్‌లు, 10 చెక్ పోస్టులు ఏర్పాటు చేశామని వెల్లడించారు.



సిద్దిపేట పరిధిలోని పొన్నాల దాబాల వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

డీఎంహెచ్‌వోగా పుట్ల శ్రీనివాస్

సిద్దిపేట టౌన్, మార్చి 16: జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిగా పుట్ల శ్రీనివాస్‌ను నియమిస్తూ ప్రభుత్వం శనివారం ఉత్తర్వులను జారీచేసింది. ఖైరతాబాద్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిగా కొనసాగుతున్న శ్రీనివాస్‌కు సిద్దిపేట డీఎంహెచ్‌వోగా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు శనివారం ఆయన బాధ్యతలు చేపట్టి, కలెక్టర్ మనుచౌదరి, అదనపు కలెక్టర్ గరీమా అగ్రవాల్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.



కలెక్టర్ మనుచౌదరికి పుష్పగుచ్ఛాన్ని అందజేసిన పుట్ల శ్రీనివాస్

సీపీవోగా కిష్టయ్య



సిద్దిపేట అగ్రికల్చర్, మార్చి 16: మెదక్ జిల్లాలో జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి(సీపీవో)గా విధులు నిర్వర్తిస్తున్న కిష్టయ్య సిద్దిపేట జిల్లా సీపీవోగా బదిలీ అయ్యారు. శనివారం కలెక్టరేట్‌లోని కార్యాలయంలోని ఆయన బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ మనుచౌదరిని మర్యాదపూర్వకంగా కలిశారు.

తండ్రిని హతమార్చిన కొడుకు

- నిత్యం తాగొచ్చి తల్లిని వేధిస్తుండడంతో ఘాతుకం
- వారం క్రితమే పోలీసులకు ఫిర్యాదు
- కౌన్సెలింగ్ ఇప్పించినా మారని తీరు
- వేధింపులు తాళలేక పథకం ప్రకారం ఉరేసి హత్య

7లో

రూ.5కోట్ల విలువైన గంజాయి దహనం

- 8 కేసుల్లో 1,982 కిలోల గంజాయి పట్టివేత

సంగారెడ్డి క్రైం, మార్చి 16: సంగారెడ్డి జిల్లావ్యాప్తంగా వివిధ పోలీస్ స్టేషన్లలో నమోదైన 8 కేసుల్లో నిందితుల నుంచి 1,982 కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కోర్టు అనుమతితో జిల్లా డ్రగ్ డిస్పోజల్ కమిటీ ఆధ్వర్యంలో పోలీసులు శనివారం కోహీర్ మండలం పైడిగుమ్మల్ గ్రామ శివారులో దహనం చేశారు. ఈ సందర్భంగా జిల్లా డ్రగ్ డిస్పోజల్ కమిటీ చైర్మన్, ఎస్పీ రూపేష్ మాట్లాడుతూ.. దహనం చేసిన గంజాయి విలువ రూ.5కోట్లు ఉంటుందని తెలిపారు. కొందరు అక్రమార్జనలో భాగంగా గంజాయిని విక్రయిస్తూ పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని యువతను ప్రలోభాలకు గురిచేస్తూ మత్తులోకి దించుతున్నారని తెలిపారు. ఈ విధమైన అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిని అరికట్టడం కోసం జిల్లావ్యాప్తంగా స్పెషల్ టాస్క్‌ఫోర్స్ పోలీసుల ద్వారా విస్తృతస్థాయిలో తనిఖీలు నిర్వహిస్తున్నామని ఆయన వెల్లడించారు. ఎవరైనా గంజాయి, ఇతర మత్తు పదార్థాలను విక్రయించినా, కొనుగోలు చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా ఎస్పీ హెచ్చరించారు.



గంజాయిని దహనం చేస్తున్న పోలీసులు

రైతుపై విత్తన భారం

- పత్తి ప్యాకెట్‌పై రూ.11 పెంచిన కేంద్రం
- ఆందోళనలో రైతులు



గజ్వేల్, మార్చి 16: కత్తి మీద సాములా మారిన పంటల సాగుపై మరింత భారాన్ని కేంద్ర ప్రభుత్వం మోపింది. తాజాగా ప్రభుత్వం పత్తి గింజల ప్యాకెట్ ధరను పెంచుతూ నిర్ణయం తీసుకోవడంతో రైతులపై అదనంగా భారం పడనుంది. సిద్దిపేట జిల్లా వ్యాప్తంగా ప్రతి ఏటా రైతులు లక్షా 50వేల ఎకరాల్లో పత్తిని సాగుచేస్తారు. ఏటా పత్తి సాగుకు అయ్యే ఖర్చు పెరుగుతున్నప్పటికీ రైతులు సాగుచేయడంలో వెనుకంజ వేయడం లేదు. ఈ ఏడాది లక్షా 50వేల ఎకరాల్లో పత్తి సాగవుతుందని వ్యవసాయాధికారులు అంచనా వేస్తున్నారు. పెట్రోల్, డీజీల్ ధరలు పెరుగుతుండడంతో ఈసారి దున్నకానికి ట్రాక్టర్ ఛార్జీలు మరింతగా పెరిగే అవకాశాలున్నాయి. ఈ క్రమంలోనే పత్తిగింజల ధర పెరగడంతో రైతులపై మరింత ఆర్థిక భారం పడనుంది. కాటన్ సీడ్ కంట్రోల్ కమిటీ సిఫారసు మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు కేంద్ర వ్యవసాయ శాఖ చెబుతున్నప్పటికీ కంపెనీలకు లాభం చేకూర్చేందుకే ధరల పెంపునకు మొగ్గు చూపిందని రైతులు వాపోతున్నారు.

ఎకరాకు మూడు నుంచి నాలుగు ప్యాకెట్లు అవసరం

జిల్లాలో రైతులు పత్తి సాగు తగ్గుతున్నప్పటికీ విత్తన ప్యాకెట్ల వినియోగం పెరుగుతున్నది. ఎకరాకు మూడు నుంచి నాలుగు ప్యాకెట్ల విత్తనాలు రైతులకు అవసరమవుతున్నాయి. ఇటీవల జిల్లాలో అధిక సాంద్రత పత్తి సాగు చేయడంతో పత్తి విత్తనాల వినియోగం పెరిగింది. జిల్లాలో లక్షా 50వేల ఎకరాలకు గాను దాదాపుగా 5లక్షల ప్యాకెట్లు అవసరమవుతాయి. ఈ మేరకు జిల్లా రైతులపై మొత్తంగా రూ.లక్షల్లో భారం పడనుంది.

నాలుగేళ్లలో రూ.134 పెరిగిన విత్తన ప్యాకెట్ ధరలు

గడిచిన నాలుగేళ్లలో రైతులపై కేంద్రప్రభుత్వం భారాన్ని మోపుతూనే ఉంది. విత్తన ధరలు పెరగడంతో అటు దున్నకం, ఇటు కూలీల ధరలు, మరోవైపు విత్తన ధరలు పెరగడంతో ఏటా ఎకరాకు సరాసరి రూ.2,000 వరకు పెట్టుబడి పెరుగుతుందని రైతులు వాపోతున్నారు. 2020-21 సంవత్సరంలో 475 గ్రాముల బీటీ-2 విత్తన ప్యాకెట్ ధర రూ.730 ఉండగా, 2021-22లో కేంద్ర ప్రభుత్వం రూ.37 పెంచగా రూ.767కు చేరింది. గతేడాది 2022-23సంవత్సరానికి పత్తి విత్తనాలపై రూ.43 పెంచడంతో రూ.810కి చేరింది. 2023-24లో మరోసారి రూ.43 పెంచడంతో పత్తి విత్తన ప్యాకెట్ ధర రూ.853కు చేరగా.. తాజాగా మరో రూ.11 ధర పెంచడంతో రూ.864కు చేరుకుంది. పెట్టుబడి పెరిగిన స్థాయిలో మద్దతు ధర కల్పించకపోవడంతో అప్పులు పెరిగి కుప్పలుగా మారుతున్నాయని, తాము చేసిన కష్టం పెట్టుబడికే పోతుందని రైతుల్లో ఆందోళన మొదలవుతుంది.



కుంటలో దూకి వ్యక్తి ఆత్మహత్య

చిన్నశంకరంపేట, మార్చి 16: మద్యానికి బానిసైన యువకుడు కుంటలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. చిన్నశంకరంపేట మండలం దర్పల్లికి చెందిన కొమ్ము వింటు(16) మద్యానికి బానిసయ్యాడు. గురువారం తల్లిదండ్రులతో గొడవపడగా మందలించారు. దీంతో మనస్తాపానికి గురై గ్రామ శివారులోని సాయమ్మకుంటలో పడి ఆత్మహత్య చేసుకున్నాడు. తల్లి శ్యామల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నారాయణగౌడ్ తెలిపారు.

అక్రమంగా నీలగిరి చెట్ల నరికివేత



ప్లాంటేషన్‌లో పెద్దఎత్తున నరికిన నీలగిరి చెట్లు

శివ్వంపేట, మార్చి 16: ఓ వైపు ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా హరిత హారం కార్యక్రమాన్ని చేపడుతుంటే... మరోవైపు అక్రమార్కులు అటవీ సంపదను కొల్లగొడుతున్నారు. ప్లాంటేషన్‌లోని నీలగిరి చెట్లను నరికి అక్రమంగా పరిశ్రమలకు తరలిస్తుండగా అటవీశాఖ అధికారులు పట్టుకున్నారు. మండల పరిధిలోని భీమ్లాతండాలో తూప్రాన్ రేంజ్ మంగళపర్తి సెక్షన్‌లో నీలగిరి ప్లాంటేషన్‌లో వందలాది చెట్లను నరికి వేస్తున్నారు. వారం రోజులుగా ప్లాంటేషన్‌లో రాత్రి సమయాల్లో చెట్లను నరికి పరిశ్రమలకు గుట్టుచప్పుడు కాకుండా తరలిస్తున్నారు. విషయం తెలుసుకున్న అటవీశాఖ అధికారులు శుక్రవారం రాత్రి సంఘటనా స్థలానికి వెళ్లి అక్రమంగా నరికిన కలపను స్వాధీనం చేసుకుని రేంజ్ కార్యాలయానికి తరలించినట్లు ఎఫ్ఆర్వో మోహన్ తెలిపారు. ఈ విషయమై కేసు నమోదు చేసుకుని సంబంధిత వ్యక్తులపై తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

రాజీమార్గమే రాజమార్గం

- సంగారెడ్డి జిల్లా ప్రధాన న్యాయాధికారి ప్రభాకర్‌రావు
- లోక్ అదాలత్‌లో 51వేల కేసుల పరిష్కారం
- మెదక్ జిల్లాలో 1817 కేసుల పరిష్కారం


సంగారెడ్డి క్రైం: భూసేకరణ నష్టపరిహారాన్ని బాధితులకు అందజేస్తున్న న్యాయాధికారులు



హుస్నాబాద్: మాట్లాడుతున్న ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ న్యాయాధికారి శివరంజని

సంగారెడ్డి క్రైం, మార్చి 16: రాజీమార్గమే రాజమార్గమని సంగారెడ్డి జిల్లా ప్రధాన న్యాయాధికారి కే.ప్రభాకర్‌రావు అన్నారు. జాతీయ లోక్ అదాలత్‌లలో కేసులు పరిష్కరించుకోవడం ద్వారా సమయం ఆదా అవడంతో పాటు సత్వర న్యాయం జరుగుతుందని అన్నారు. సంగారెడ్డి జిల్లా కోర్టు హాల్‌లో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిష్కారానికి అనువైన కేసులన్నీ లోక్ అదాలత్‌లలో పరిష్కరించుకోవచ్చని తెలిపారు. దీనిద్వారా కక్షిదారులకు సరైన పరిహారం కూడా సకాలంలో అందుతుందని చెప్పారు.

జిల్లావ్యాప్తంగా 9 బెంచీలు.. 51వేల కేసుల పరిష్కారం

సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని కోర్టు ప్రాంగణంలో ఐదు బెంచీలు ఏర్పాటు చేశారు. జహీరాబాద్, నారాయణఖేడ్, జోగిపేట కోర్టులలో నాలుగు బెంచీలు ఏర్పాటు చేసి లోక్ అదాలత్ నిర్వహించారు. ఆయా కోర్టులలో మొత్తం 51,078 కేసులు పరిష్కరించారు. ఇందులో క్రిమినల్ కాంపౌండ్ కేసులు 16,206, మోటార్ వాహన ప్రమాద నష్టపరిహార కేసులు 29, సివిల్ తగాదాలు 28, బ్యాంకు రికవరీ కేసులు 85, ప్రిలిటిగేషన్ కేసులు 34,002, ఎపిటిఎస్ ప్రిలిటిగేషన్ కేసులు 723, భూసేకరణ కేసులు 5 పరిష్కరించారు. పోతిరెడ్డిపల్లి హౌసింగ్ బోర్డుకు సంబంధించిన భూసేకరణ నష్టపరిహారాన్ని బాధితులకు అందజేశారు. సంగారెడ్డి జిల్లా కోర్టులో జరిగిన జాతీయ లోక్ అదాలత్‌లను తెలంగాణ హైకోర్టు, లీగల్ సర్వీసెస్ అథారిటీ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ పి.శ్యామ్, తెలంగాణ లీగల్ సర్వీసెస్ అథారిటీ సంయుక్త కార్యదర్శి జి.గోవర్దన్‌రెడ్డి పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో మొదటి అదనపు జిల్లా న్యాయాధికారి జి.సుదర్శన్, న్యాయాధికారులు డా.పి. కృష్ణార్జున, సునీతారవీంద్రారెడ్డి, ఎం.లావణ్య, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జె.హన్మంతరావు, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ న్యాయాధికారి లక్ష్మణ్‌చారి, జ్యూడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ తేజశ్రీ, ఎస్పీ చెన్నూరి రూపేష్, అధ్యక్షుడు ఎ.విష్ణువర్దన్‌రెడ్డి పాల్గొన్నారు.

జాతీయ లోక్ అదాలత్‌లో 288 కేసుల పరిష్కారం

హుస్నాబాద్, మార్చి 16: హుస్నాబాద్‌లోని మున్సిఫ్ కోర్టులో జరిగిన జాతీయ లోక్ అదాలత్‌లో 288 కేసులు పరిష్కారమయ్యాయి. ఇందులో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ కోర్టులో 105 కేసులు, అడిషనల్ జూనియర్ సివిల్ కోర్టులో 183 కేసులు పరిష్కారమైనట్లు తెలిపారు. రాజీ ద్వారా కేసులను పరిష్కరించుకోవాలని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ న్యాయాధికారి శివరంజని అన్నారు. అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కృష్ణతేజ్, పీపీ రవికుమార్, ఏజీపీ రామక్రిష్ణ పాల్గొన్నారు.

మెదక్ జిల్లాలో..

మెదక్‌అర్బన్/నర్సాపూర్, మార్చి 16: జాతీయ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు జిల్లావ్యాప్తంగా నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 1817 కేసులు పరిష్కారమయ్యాయని చైర్‌పర్సన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి లక్ష్మీశారద తెలిపారు. కోర్టు ఆవరణలో అదాలత్‌ను ఆమె ప్రారంభించి మాట్లాడారు. కోర్టులలో ఎన్నో కేసులు పెండింగ్‌లో ఉంటున్నాయని, త్వరితగతిన పరిష్కరించి న్యాయం అందించడానికి లోక్ అదాలత్ ఉపయోగపడుతుందన్నారు. ఈ కేసుల్లో రూ.1,42,38,409లను నష్టపరిహారం కింద అందించామన్నారు. సీనియర్ సివిల్ జడ్జి జితేందర్, జూనియర్ సివిల్ జడ్జి రీటాలాల్‌చంద్ పాల్గొన్నారు. లోక్ అదాలత్ ద్వారా రాజీ కుదుర్చుకుని కేసుల నుంచి విముక్తి పొందవచ్చని నర్సాపూర్ జూనియర్ సివిల్ కోర్టు జడ్జి కే.అనిత పేర్కొన్నారు. నర్సాపూర్ కోర్టులో నిర్వహించిన లోక్‌అదాలత్‌లో పలు కేసులను పరిష్కరించారు.

అక్రమ కేసులు.. ఆస్తుల విధ్వంసంతో అడ్డుకోలేరు

- ఎన్నికల సమసయంలోనే రాజకీయాలు
- ప్రజాస్వామ్యంలో వ్యక్తిగత కక్షలకు తావులేదు
- మాదారంలో బాధితులకు అండగా ఉంటాం: ఎమ్మెల్యే


రెవెన్యూ అధికారులు కూల్చివేసిన కట్టడాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

జిన్నారం, మార్చి 16: తమ పార్టీలో చేరికల కోసం అక్రమ కేసులు, ఆస్తుల విధ్వంసంతో ఒత్తిళ్లకు గురిచేయటం కాంగ్రెస్‌కే చెల్లిందని, ఇలాంటి చర్యలతో తమను అడ్డుకోలేరని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. శనివారం జిన్నారం మండలం మాదారంలో రెవెన్యూ అధికారులు కూల్చివేసిన కట్టడాలను ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి, పార్టీ నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో పక్షపాతానికి పాల్పడలేదని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం వ్యక్తిగత కక్షలకు దిగడం సరికాదన్నారు. నిరుపేదల ఆస్తుల విధ్వంసం, అక్రమ కేసులతో కాంగ్రెస్ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నదన్నారు. మాదారంలో జీవనోపాధి కోసం పేదలు ఇళ్లను నిర్మించుకుంటే.. కాంగ్రెస్ నాయకులు ఫిర్యాదు చేసి కూల్చి వేయించడం బాధాకరమని పేర్కొన్నారు. నష్టపోయిన బాధితులకు అండగా ఉంటామని, వారికి ఆర్థిక సహాయం అందజేస్తామని తెలిపారు. పోరాటాల చరిత్ర గల బీఆర్ఎస్‌కు కేసులు, జైళ్లు కొత్త కాదని కాంగ్రెస్ అరాచకాలను ప్రజాక్షేత్రంలో ఎండగడతామని ఎమ్మెల్యే అన్నారు. నివాసాలు కోల్పోయిన బాధితులను ఆయన పరామర్శించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ ప్రభాకర్, ఎంపీటీసీ వెంకటేశం గౌడ్, మాజీ సర్పంచ్ సురేందర్‌గౌడ్, పార్టీ మండలాధ్యక్షుడు రాజేశ్, మాజీ సర్పంచులు, నాయకులు పాల్గొన్నారు.

తండ్రిని హతమార్చిన కొడుకు

- నిత్యం తాగొచ్చి తల్లిని వేధిస్తుండడంతో ఘాతుకం
- వారం క్రితమే పోలీసులకు ఫిర్యాదు
- కౌన్సెలింగ్ ఇప్పించినా మారని తీరు
- వేధింపులు తాళలేక పథకం ప్రకారం ఉరేసి హత్య


ఘటనా స్థలంలో ఆధారాలు సేకరిస్తున్న క్లూస్‌టీం,


సంగం ప్రేమానందం(ఫైల్)

పాపన్నపేట, మార్చి 16: నిత్యం తాగొచ్చి తల్లిని వేధిస్తున్నాడని కన్న తండ్రిని కొడుకు హత్య చేశాడు. ఈ సంఘటన మెదక్ జిల్లా పాపన్నపేట మండల పరిధిలోని రామతీర్థం గ్రామంలో శనివారం చోటు చేసుకున్నది. స్థానికులు, ఎస్ఐ నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన సంగం ప్రేమానందం(45), సుగుణమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు, కుమార్తె. పెద్ద కుమారుడు సందీప్ సిద్దిపేటలో డిగ్రీ, కూతురు సంపూర్ణ ఓ రెసిడెన్షియల్ పాఠశాలలో 9వ తరగతి, చిన్న కొడుకు ఏడో తరగతి చదువుతున్నారు. కాగా మద్యానికి బానిసైన ప్రేమానందం తరచూ భార్యను అనుమానిస్తూ వేధించడమే కాకుండా తీవ్రంగా కొట్టేవాడు. పలుమార్లు పెద్దల సమక్షంలో పంచాయితీ పెట్టి సర్ది చెప్పినా తీరు మారలేదు. ఈ క్రమంలో గత బుధవారం మళ్లీ గొడవ జరగ్గా.. భార్య సుగుణమ్మ, పెద్ద కుమారుడు సందీప్ కలిసి ప్రేమానందంను రోకలి బండతో నడవరాకుండా కొట్టి.. సుగుణమ్మ తల్లిగారి ఊరైన అల్లాదుర్గం మండల పరిధి రెడ్డిపల్లి గ్రామానికి వెళ్లిపోయింది. శనివారం సందీప్ ఇంటికి వచ్చేసరికి తండ్రి ప్రేమానందం, తాత ప్రసాద్ మాట్లాడుకుంటున్నారు. అందరినీ బయటకు వెళ్లగొట్టిన సందీప్ లోపలి నుంచి తలుపులు పెట్టాడు. లేవలేని స్థితిలో ఉన్న తండ్రిని కరెంట్ హీటర్, ఇతర వస్తువులతో విచక్షణారహితంగా కొట్టాడు. దెబ్బలకు తాళలేక ప్రేమానందం అరవడంతో చుట్టుపక్కల వారు వచ్చి తలుపులు తీయమని చెప్పారు. వారి మాటను పట్టించుకోని సందీప్.. కొన ఊపిరితో ఉన్నాడు. కొద్దిగా ఆగండి, ప్రాణం పోయాక తలుపులు తీస్తానంటూ ఆగ్రహం వ్యక్తం చేసినట్లు గ్రామస్థులు తెలిపారు. కొద్దిసేపటి తర్వాత చున్నీతో ప్రేమానందంకు ఉరేసి చంపి బయటకు వచ్చాడు. వెంటనే గ్రామస్థులు పోలీసులకు సమాచారమందించారు. ఎస్ఐ నరేష్ ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి ఉన్నతాధికారులకు తెలిపారు. మెదక్ రూరల్ సీఐ కేశవులు, క్లూస్‌టీం సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మెదక్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి తమ్ముడు కూడా నెల క్రితం ఆత్మహత్య చేసుకున్నట్లు గ్రామస్థులు వివరించారు. కాగా వారంరోజుల క్రితమే మృతుడి వేధింపులు భరించలేక కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేసి.. కౌన్సెలింగ్ ఇప్పించారు. అయినా అతనిలో ఎలాంటి మార్పు రాకపోవడంతో సందీప్ ఈ దారుణానికి పాల్పడ్డాడని తెలిసింది. సందీప్ ఇటీవల పోలీసు ఉద్యోగానికి సిద్ధం కాగా.. కాస్తలో ఉద్యోగం చేజారింది.

ఐఐటీహెచ్‌లో కొనసాగుతున్న 'ఎలాన్ ఎన్‌విజన్'

- నేటితో ముగియనున్న ఎలాన్ ఫెస్ట్


ఐఐటీహెచ్‌లో టార్గెట్ షూట్ గేమ్ ఆడుతున్న విద్యార్థులు


పోటీలను తిలకిస్తున్న ఐఐటీహెచ్ డైరెక్టర్ మూర్తి, అధ్యాపక బృందం

కంది, మార్చి 16: సంగారెడ్డి జిల్లా కంది శివారులోని ఐఐటీ హైదరాబాద్‌లో ఎలాన్ ఎన్‌విజన్ టెక్నో కల్చరల్ ఫెస్ట్ వేడుకలు సీక్రెట్ ఆఫ్ వాలెన్రో థీమ్‌తో శుక్రవారం ప్రారంభమైన విషయం తెలిసిందే. ఈ సంవత్సరం ఎలాన్ ఎన్‌విజన్ దేశ నలుమూలల నుంచి వేలాదిమంది విద్యార్థులు సాంస్కృతిక పోటీల్లో పాల్గొన్నారు. శనివారం సాయంత్రం ఫన్నీ ఫొటోస్ గేమ్, టార్గెట్ షూటర్, వాటర్ గన్స్ కాంపిటీషన్ పోటీలు అందరినీ అలరించాయి. ఈ పోటీలను ఐఐటీహెచ్ డైరెక్టర్ బిఎస్ మూర్తితో పాటు అధ్యాపక బృందం తిలకించారు. విద్యార్థుల్లో ప్రతిభను వెలికి తీయాలంటే ఇలాంటి సాంకేతిక పోటీలు ఎంతో అవసరమని పేర్కొన్నారు. నృత్యాంజలి, ప్రోషో-ఎబిసి, స్టీవ్, సాంకేతిక వర్క్‌షాప్‌ల పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులు వారివారి సామర్థ్యాన్ని వెలికితీస్తూ అందరినీ ఆకట్టుకున్నాయి. ప్రతీ సంవత్సరం మాదిరిగానే వెబ్ డిజైనింగ్, షార్క్ ట్యాంక్, క్విజ్ హబ్‌ల టాక్ షోలో పాల్గొనేందుకు విద్యార్థులు మక్కువ చూపారు. బ్రేక్‌ఫ్రీ సోలో, బ్రేక్‌ఫ్రీ గ్రూప్, ప్రస్టోఫిషల్, గజేంద్రవర్మ పాటలు, స్టాండప్ కాంపిటీషన్, క్యాంపస్ ఐడల్, స్టాండప్ ఆదివారం షుగర్ రాక్రెట్రీ, డ్రోన్ ఛాలెంజ్, ఎక్స్‌ప్లోజర్, ఆర్టిఎటాక్, జనరల్ క్విజ్, స్పోర్ట్స్ క్విజ్, ఎగ్మా, ఇ-వేస్ మేనేజ్‌మెంట్, షార్క్ ట్యాంక్, ఆర్టిఫిషల్ ఇంటలిజెన్స్ వర్క్‌షాప్, ఎథికల్ హ్యాకింగ్ అండ్ సైబర్ క్రైం, డీప్ లెర్నింగ్ వర్క్‌షాప్, డాటా సైన్స్ విత్ పైథాన్ వర్క్‌షాప్, వెబ్ డెవలప్‌మెంట్ వర్క్‌షాప్, గ్లిట్జ్ గ్లామర్, యునిబాల్ సీజన్, ప్రోషో డీజేషాన్, నాట్యాక్రం, ఆక్టీవ్, డీజే వార్స్, హనీవెల్ సెమినార్స్, ఈఎమ్ఎల్ టాక్‌షో, గ్రీన్‌కో సెమినార్, ఫిల్మ్‌ఫేర్ ఫియస్టా ప్రొజెక్షన్స్ విభాగాల్లో పోటీ జరగనున్నాయని అధికారులు వెల్లడించారు.

చినుకుపడితే చీకటే..!

- మెదక్‌లో రెండు గంటల పాటు నిలిచిన విద్యుత్ సరఫరా

మెదక్ అర్బన్, మార్చి 16: చిన్నపాటి వర్షం.. వీచివీయని గాలులకే మెదక్ జిల్లా కేంద్రంలో విద్యుత్ సరఫరా నిలిపోతుంది. విద్యుత్ వ్యవస్థలో ఏదో ఒక అంతరాయం ఏర్పడటంతో పట్టణవాసులు గంటల కొద్దీ చీకటిలో మగ్గాల్సి వస్తున్నది. శనివారం సాయంత్రం కురిసిన చిన్నపాటి వర్షానికి సాయంత్రం 6:30 నుంచి 8:35 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

రామాయంపేటలో ఈదురుగాలులతో కూడిన వర్షం..

రామాయంపేట, మార్చి 16: రామాయంపేట పట్టణంలో శనివారం రాత్రి ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. విద్యుత్ అంతరాయం ఏర్పడింది. అలాగే గాలులకు పట్టణంలోని టీస్టాల్ షెడ్లు ఎగిరిపడగా, పలుచోట్ల చెట్లు విరిగాయి.

ఖేడ్‌లో మోస్తారు వర్షం

నారాయణఖేడ్, మార్చి 16: ఖేడ్ పట్టణంతోపాటు పరిసర గ్రామాల్లో శనివారం తెల్లవారుజామున దాదాపు అరగంటపాటు మోస్తారు వర్షం కురిసింది. కొద్దిరోజులుగా తీవ్రమైన ఎండల కారణంగా చల్లబడటంతో జనాలు ఉపశమనం పొందారు.

పంట కోతల ప్రయోగంతోనే దిగుబడుల అంచనా


ఔరంగాబాద్‌తండాలో పంట కోతల ప్రయోగాన్ని పరిశీలిస్తున్న బద్రినాథ్

హవేళిఘణపూర్, మార్చి 16: పంట కోతల ప్రయోగం ద్వారానే పంటల దిగుబడిని తెలుసుకోవచ్చని జిల్లా గణాంక శాఖాధికారి బద్రినాథ్ తెలిపారు. శనివారం మండలంలోని ఔరంగాబాద్ తండాలోని సర్వే నంబర్ 72లో రైతు కేతావత్ రాజు మొక్కజొన్న పంట పొలంలో పంట కోత ప్రయోగాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 5బై5 మీటర్ల విస్తీర్ణంలో మొక్కజొన్న పంట సాగుచేయగా.. 11,926 కిలో గ్రాముల దిగుబడి వచ్చిందన్నారు. ఈ దిగుబడుల ఆధారంగా జిల్లా, రాష్ట్ర దిగుబడులను అంచనా వేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డివిజనల్ ఉప గణాంకాధికారి వెంకటేష్, సహాయక అధికారి సురేష్, మండల గణాంకాధికారిణి భార్గవి, రైతులు పాల్గొన్నారు.


సీఎంఆర్ బియ్యం డెలివరీ వేగవంతం చేయాలి

- టెండర్లు పూర్తయిన యాసంగి ధాన్యం వెంటనే అప్పగించాలి
- పౌర సరఫరాల శాఖ కమిషనర్ చౌహాన్


వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న సివిల్ సప్లయ్ కమిషనర్ చౌహాన్, హాజరైన అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, అధికారులు

మెదక్, మార్చి 16: మిల్లర్లు సీఎంఆర్ డెలివరీని వేగవంతం చేసి వానాకాలం బియ్యం అప్పగించాలని పౌరసరఫరాల శాఖ కమిషనర్ చౌహాన్ అదనపు కలెక్టర్, పౌరసరఫరాల అధికారులకు సూచించారు. శనివారం హైదరాబాద్ నుంచి పౌరసరఫరాల అధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఖరీఫ్ 2023-24 సీజన్‌కు సంబంధించి సీఎంఆర్ డెలివరీ, రబీ 2022-23 సీజన్‌కు టెండర్ అయిన ధాన్యం మిల్లర్లకు అప్పగించడంపై అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ హరికృష్ణ, అధికారులతో కలెక్టరేట్ కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ సమావేశం ఏర్పాటు చేశారు. జిల్లాలోని మిల్లర్లు డెలివరీ పూర్తిచేసి రాష్ట్రంలో మెదక్ జిల్లాను ముందు వరుసలో నిలపాలని సూచించారు. సివిల్ సప్లయ్ అధికారులు పాల్గొన్నారు.

పల్వంచలో వ్యక్తి అదృశ్యం


భూమయ్య (ఫైల్)

టేక్మాల్, మార్చి 16: వ్యక్తి అదృశ్యమైన సంఘటన మండలంలోని పల్వంచ గ్రామంలో చోటు చేసుకున్నది. ఎస్ఐ మురళీ వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పల్వంచ భూమయ్య(25) ఈనెల 14న సాయంత్రం 6.30 నిమిషాలకు టేక్మాల్‌లోని చర్చికి పోతున్నాని వెళ్లాడు. మరుసటి రోజు వ్యవసాయ పొలం వద్ద బైక్ కనిపించడంతో కొడుకు ఫోన్ చేయగా.. స్విచ్ఛాఫ్ వచ్చింది. బంధువుల, చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో భూమయ్య భార్య నీరజ శనివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకుకేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అధిక వడ్డీ ఆశచూపి మోసగించిన వ్యక్తి అరెస్ట్

- వివరాలు వెల్లడించిన డీఎస్పీ సామ వెంకట్‌రెడ్డి


నిందితుడి వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ, సీఐ, ఎస్ఐ

తూప్రాన్, మార్చి 16: తూప్రాన్ పట్టణంలో అధిక వడ్డీ ఆశచూపి వసూళ్లు చేసుకొని పరారైన వ్యక్తిని శనివారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తూప్రాన్ డీఎస్పీ సామ వెంకట్‌రెడ్డి తెలిపారు. తూప్రాన్ పట్టణానికి చెందిన బిజిలిపురం యాదగిరి(37) ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తూ చిట్టీల వ్యాపారం నిర్వహిస్తుండేవాడు. చిట్టీలు వేసిన వ్యక్తులకు అధిక వడ్డీ ఆశచూపి సొంతానికి వాడుకున్నాడు. అలాగే బ్యాంకు రుణాలు ఇప్పిస్తూ ఆ డబ్బులను అధిక వడ్డీ ఆశచూపి వాడుకున్నాడు. డబ్బులిచ్చిన వ్యక్తులు అడుగుతుండటంతో ఈనెల 4న భార్యా పిల్లలతో పరారయ్యాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు యాదగిరిని పట్టుకుని విచారించగా రూ.2.46 కోట్లు మోసం చేసినట్లు ఒప్పుకున్నట్లు డీఎస్పీ వివరించారు. నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచినట్లు తెలిపారు. తూప్రాన్ సీఐ రెడ్డబోయిన కృష్ణ, ఎస్ఐ శివానందం ఉన్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కుట్రలో భాగమే కవిత అరెస్ట్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కుట్రలో భాగంగా ఎమ్మెల్సీ కవితను అరెస్ట్ చేశాయని, ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా ఈడీ అధికారులు అరెస్టుచేయడం రాజ్యాంగ విరుద్ధమని నాయకులు అన్నారు. శనివారం జిల్లా వ్యాప్తంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, నాయకులు ఎమ్మెల్సీ కవిత అరెస్ట్‌కు నిరసనగా ధర్నాలు, రాస్తారోకోలు చేశారు. ప్రధాని మోదీ డౌన్‌డౌన్ అంటూ నినాదాలు చేశారు. కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు.



సిద్దిపేటలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద రాస్తారోకో చేస్తున్న బీఆర్ఎస్ పార్టీ నాయకులు



మద్దూరులో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు



రాయపోల్‌లో ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ నాయకులను అడ్డుకుంటున్న పోలీసులు

దుబ్బాక/మిరుదొడ్డి,మార్చి16: కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు కలిపి ఎమ్మెల్సీ కవితను ఈడీ అరెస్టుచేయడం సిగ్గుచేటని దుబ్బాక ఎమ్మెల్యే కొత్తప్రభాకర్‌రెడ్డి మండిపడ్డారు. శనివారం కవిత అరెస్టును నిరసిస్తూ అక్బర్‌పేట చౌరస్తాలో, దుబ్బాక బస్టాండ్ వద్ద బీఆర్ఎస్ నాయకులతో కలిసి వేరువేరుగా ధర్నాను నిర్వహించారు. ఆయన వెంట బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు రాజమౌళి, సతీష్‌రెడ్డి, దుబ్బాక, అక్బర్‌పేట-భూంపల్లి మండల అధ్యక్షుడు శ్రీనివాస్, జీడిపల్లిరవి, మున్సిపల్ చైర్‌పర్సన్ వనితాభూంరెడ్డి, కౌన్సిలర్లు శ్రీనివాస్, బాలకిషన్, రాములు, ఆసస్వామి, యాదగిరి, ఎంపీపీ ఉపాధ్యక్షుడు రాజు, ఎంపీటీసీ రాంరెడ్డి, నాయకులు వంశీకృష్ణాగౌడ్, ఎల్లారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, కిషన్, అంజిరెడ్డి, రాజరెడ్డి, సత్యం, కృష్ణలింగం, సురేష్, శ్రీనివాస్ తదితరులున్నారు.

● **గజ్వేల్:** కేసీఆర్ కుటుంబంపై కుట్రలు సరికావని శాసనమండలి సభ్యులు డాక్టర్ వంటేరి యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర శాఖ ఆదేశాల మేరకు గజ్వేల్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించిన అనంతరం ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. వారితో గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపల్ చైర్మన్ రాజమౌళి, ఎంపీపీలు అమరావతి, రాగల సుగుణ, పాండుగౌడ్, లతా, జడ్పీటీసీ పంగ మల్లేశం, ఏఎంసీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, జగదేవ్‌పూర్ పాక్స్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, రామకృష్ణారెడ్డి, జేజాల వెంకటేశ్‌గౌడ్, ఆత్మమాజీ చైర్మన్ ఊడెం కృష్ణారెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు పనుగట్ల శ్రీనివాస్‌గౌడ్, వెంకట్‌రెడ్డి, నవాజ్‌మీరా, నూనె కుమార్, మునిసిపల్ కౌన్సిలర్లు ఉన్నారు.

● **హుస్నాబాద్:** ఎమ్మెల్సీ కవితను ఈడీ అరెస్ట్ చేయడాన్ని నిరసిస్తూ హుస్నాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో బీఆర్ఎస్ నాయకులు రాస్తారోకో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్ హాజరయ్యారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత, వైస్ చైర్‌పర్సన్ అయిలేని అనిత, ఎంపీపీ మానస, మాజీ మార్కెట్ చైర్‌పర్సన్ ఎడబోయిన రజిని, తిరుపతిరెడ్డి, మాజీ ఎంపీపీ ఆకుల వెంకట్, మాజీ మున్సిపల్ చైర్మన్ సుద్దాల చంద్రయ్య బీఆర్ఎస్ మండల పట్టణ అధ్యక్షులు మధుకర్‌రెడ్డి, ఎండి అన్వర్, చిట్టి గోపాల్‌రెడ్డి, అయిలేని మల్లిఖార్జున్‌రెడ్డి,బొలిశెట్టి సుధాకర్, కౌన్సిలర్లు గూళ్ళ రాజు, స్వరూప,రవీందర్, బీఎస్పీ నాయకులు శంకర్, రాజు తదితరులున్నారు.

● **దౌల్తాబాద్:** బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో దౌల్తాబాద్ మండల కేంద్రంలోని శివాజీ చౌరస్తా వద్ద మండల ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు బండారు దేవేందర్, దొమ్మాట మాజీ సర్పంచ్ కొమ్మెర పూజీత వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహించారు. ప్రధాని మోదీ డౌన్‌డౌన్ అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో మండల కోఆప్షన్ సభ్యుడు హమ్మద్, బీఆర్ఎస్ నాయకులు ఉమ్మడి నర్సింహరెడ్డి, సంబగ యాదగిరి, పెరమాండ్ల రాములు, సలీం, షబ్బీర్, బాల్‌రెడ్డి, చంద్రారెడ్డి పాల్గొన్నారు.

● **రాయపోల్:** ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అరెస్టును నిరసిస్తూ రాయపోల్‌లో బీఆర్ఎస్ నాయకులు రోడ్డుపై బైఠాయించి ధర్నా చేపట్టారు. దీంతో గజ్వేల్, రామాయంపేట రహదారిపై వాహనాలు నిలిచిపోయాయి. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు వెంకటేశ్వరశర్మ, నాయకులు ఇప్ప దయాకర్, ఉప్పల భార్గవ్ పాల్గొన్నారు.

● **మద్దూరు:** మండల కేంద్రంలో బీఆర్ఎస్ మండల పార్టీ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ కవిత అరెస్ట్‌కు నిరసనగా కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు మేక సంతోష్, బర్మ రాజమల్లయ్య, దామెర మల్లేశం, చొప్పరి సాగర్, ముక్క కనకయ్య, కాసర్ల కనకరాజు, జీడికంటి సుదర్శన్, వూట్ల రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

● **తొగుట:** ఎమ్మెల్సీ కవిత అరెస్టును నిరసిస్తూ బీఆర్ఎస్ నాయకులు తొగుట మార్కెట్ యార్డు ఎదుట రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో చేపట్టారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు రాంరెడ్డి, కోఆపరేటివ్ సొసైటీ చైర్మన్ హరికృష్ణరెడ్డి, బీఆర్ఎస్ పార్టీ మండల మాజీ అధ్యక్షుడు మల్లారెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కొమురయ్య, ఎంపీటీసీలు వేల్పుల స్వామి, శ్రీకాంత్‌రెడ్డి, నాయకులు గోవర్దన్‌రెడ్డి, అనిల్, రమేశ్, రాంరెడ్డి, వెంకట్‌రెడ్డి, నరేందర్‌గౌడ్, పరమేశ్వర్‌రెడ్డి, మధుసూధన్‌రెడ్డి, శ్రీధర్, స్వామిరెడ్డి, యాదగిరి పాల్గొన్నారు.

● **కొమురవెల్లి:** ఎమ్మెల్సీ కవిత అరెస్టును నిరసిస్తూ మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు రోడ్డుపై బైఠాయించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సిద్ధప్ప, మండల పార్టీ అధ్యక్షుడు గిస బిక్షపతి, వైస్ ఎంపీపీ రాజేందర్‌రెడ్డి, నాయకులు, ముత్యం నర్సింలు, నాగమల్ల బిక్షపతి, గొల్లపల్లి కిష్టయ్య, తలారి కిషన్, సార్ల కిష్టయ్య, నాగమల్ల సత్యనారాయణ పాల్గొన్నారు.

● **కోహెడ:** ఢిల్లీ లిక్కర్ కేసులో ఎమ్మెల్సీ కవితను ఈడీ అక్రమంగా అరెస్టు చేసిందని ఆరోపిస్తూ కోహెడ మండల కేంద్రంలో బీఆరెస్ పార్టీ నాయకులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద రాస్తారోకో నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ లక్ష్మణ్, మండల పరిషత్ కోఆప్షన్ సభ్యుడు అబ్దుల్ ఖదీర్, ఎంపీటీసీ శేఖర్, నాయకులు గవ్వ వంశీధర్‌రెడ్డి, ఆవుల మహేందర్, మాజీ కో ఆప్షన్ సభ్యుడు రహీం, అనిల్, జాలిగాం శంకర్, బిక్షపతి, వీరస్వామి పాల్గొన్నారు.

● **చేర్యాల:** ఎమ్మెల్సీ కవిత అరెస్టును నిరసిస్తూ చేర్యాలలో బీఆర్ఎస్ నాయకులు ధర్నా చేపట్టారు. ఈసందర్భంగా గాంధీచౌక్ వద్ద జనగామ-సిద్దిపేట ప్రధానరహదారిపై బైఠాయించి ఆందోళనకు దిగారు. కార్యక్రమంలో ఎంపీపీ వుల్లంపల్లి కరుణాకర్, మునిసిపల్ చైర్‌పర్సన్ అంకుగారి స్వరూపారాణి, వైస్ చైర్మన్ నిమ్మ రాజీవ్‌రెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు అనంతుల మల్లేశం, సర్పంచుల ఫోరం మాజీ మండలాధ్యక్షుడు పెడుతల ఎల్లారెడ్డి, కౌన్సిలర్లు మంగోలు చంటి, యాట కనకమ్మ, సతీశ్, నాయకులు చందు, మంచాల కొండయ్య, పెంబర్ల రాజశేఖర్, పచ్చిమడ్ల సిద్దిరాములు, బుట్టి శ్రీనివాస్, కందుకూరి సిద్దిలింగం పాల్గొన్నారు.

● **ములుగు:** తెలంగాణను సాధించిన కేసీఆర్ కుటుంబాన్ని రాజకీయంగా ఎదుర్కోలేక బీజేపీ పార్టీ కేసుల్లో ఇరికించి ఇబ్బందులకు గురి చేయడం సరైనది కాదని ములుగు మండల పార్టీ అధ్యక్షుడు జహంగీర్ విమర్శించారు.ములుగులో విలేఖరుల సమావేశంలో మాట్లాడారు.

●**సిద్దిపేట టౌన్:** పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద ఎమ్మెల్సీ కవిత అరెస్టును తీవ్రంగా ఖండిస్తూ బీఆర్ఎస్ పార్టీ పిలుపు మేరకు నాయకులు, కార్యకర్తలు ధర్నా, రాస్తారోకోను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ చెర్‌పర్సన్ రోజారాధాకృష్ణశర్మ, మాజీ మున్సిపల్ చైర్మన్ రాజనర్సు, పట్టణ అధ్యక్షుడు కొండం సంపత్‌రెడ్డి, సీనియర్ నాయకులు పాల సాయిరాం, మచ్చ వేణుగోపాల్‌రెడ్డి, వంగ నాగిరెడ్డి, ఐదు మండలాల ఎంపీపీలు, జడ్పీటీసీలు, మండల పార్టీ అధ్యక్షులు నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులు, విద్యార్థి, యువజన మహిళా ఇతర అనుబంధ సంఘాల అధ్యక్షులు, కమిటీ సభ్యులు పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



హుస్నాబాద్‌లోని అంబేడ్కర్ చౌరస్తాలో రాస్తారోకో చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు



కోహెడలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులు



కొమురవెల్లిలో ధర్నా చేస్తున్న నాయకులు



తొగుట మార్కెట్ యార్డు ఎదుట రోడ్డుపై రాస్తారోకో చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

కాలువ నిర్మాణ పనులను త్వరగా పూర్తిచేయాలి

● దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

మిరుదొడ్డి, మార్చి16: మల్లన్నసాగర్ కాల్వ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, దాని ద్వారా రైతులకు సాగునీరు అందుతుందని దుబ్బాక ఎమ్మెల్యే కొత్తప్రభాకర్‌రెడ్డి తెలిపారు. శనివారం మిరుదొడ్డి మండలం చెప్యాల గ్రామశివారులో నిర్మిస్తున్న ప్యాకేజీ 13లో నిలిచిపోయిన కాల్వనిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాల్వ నిర్మాణ పనులను పూర్తిచేయడానికి రైతులు సహకరించాలన్నారు. ప్యాకేజీ 13లో ఒక రైతు వల్ల కాల్వనిర్మాణ పనులు ఆగిన విషయాన్ని స్థానిక రైతులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకు వచ్చారు. సంబంధిత రైతుతో మాట్లాడి కాల్వ నిర్మాణ పనులను పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట ఎంపీపీఉపాధ్యక్షుడు రాజు, కోఆప్షన్ సభ్యుడు హైమ్మద్, నాయకులు తుమ్మల బాల్‌రాజు, అంజిరెడ్డి, లింగం, మధు, సత్యం, దుర్గారెడ్డి, రాజయ్య, మల్లయ్య ఉన్నారు.



చెప్యాల గ్రామశివారులో కాలువ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కొత్తప్రభాకర్‌రెడ్డి

విద్యార్థులకు ఆర్డీఎఫ్ పాఠశాల అద్భుత అవకాశం

● జడ్పీ చైర్‌పర్సన్ రోజా రాధాకృష్ణశర్మ



సాంస్కృతిక కార్యక్రమంలో విద్యార్థులు

నారాయణరావుపేట, మార్చి16: గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఆర్డీఎఫ్ పాఠశాల అద్భుతమైన అవకాశమని జడ్పీ చైర్‌పర్సన్ రోజా రాధాకృష్ణశర్మ అన్నారు. శనివారం నారాయణరావుపేట మండలం మాటిండ్ల గ్రామంలోని ఆర్డీఎఫ్ పాఠశాల స్థాపించి 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా, సిల్వర్ జూబ్లీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ.. గ్రామీణ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు ముందుచూపుతో మాజీ సీఎం కేసీఆర్ ఆర్డీఎఫ్ పాఠశాలను మాటిండ్లలో ఏర్పాటు చేశారన్నారు. భోజన వసతి కల్పించి కార్పొరేట్ స్థాయిలో విద్యా బోధనను ఆర్డీఎఫ్ పాఠశాల అందించడం బాగుందని కితాబునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ ఒగ్గు బాలకృష్ణ, ఆర్డీఎఫ్ సీఓఓ సవితదత్తే మినాన్, ఆర్డీఎఫ్ సెక్రటరీ అడ్డాల, డైరెక్టర్ ఆమ్రపాలి, ఆరీఎఫ్ సీఈవో వందితరావు, మాజీ సర్పంచ్ నారాయణ, పీఏసీఎస్ డైరెక్టర్ రామచంద్రం,పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

'నీటిని సిద్దిపేటకు తరలించారు'

● కాంగ్రెస్ నాయకులు

కొమురవెల్లి, మార్చి 16 : స్థానిక రైతుల పొలాలకు నీళ్లు ఇవ్వకుండా తపాస్‌పల్లి రిజర్వాయర్ నీటిని సిద్దిపేటకు బీఆర్ఎస్ ప్రభుత్వం తరలించిందని, చేర్యాల, మద్దూరు ,కొమురవెల్లి, దూల్మిట్ట కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆరోపించారు. శనివారం జనగామ డీసీసీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ఆదేశాలతో రిజర్వాయర్‌లోకి నీటిని విడుదల చేశారు. కార్యక్రమంలో మద్దూరు జడ్పీటీసీ గిరి కొండల్‌రెడ్డి, మల్లన్న ఆలయ పునరుద్ధరణ కమిటీ చైర్మన్ లక్ష్మారెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మహాదేవుని శ్రీనివాస్, ఎంపీటీసీ కవితా కనకరాజు, మాజీ సర్పంచ్ రమణారెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కురుమలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

కోహెడ, మార్చి 16 : రాజకీయంగా, ఉద్యోగపరంగా గొల్ల కులస్తులతో కురుమలను కలపడంతో కురుమ వారికి అన్యాయం జరుగుతున్నదని జిల్లా కురుమ సంఘం సహాయ కార్యదర్శి చిగురు కొమురయ్య, మండల కురుమ సంఘం అధ్యక్షుడు కోనే శేఖర్‌లు అన్నారు. శనివారం మండల కేంద్రంలో వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మంత్రి మండలి ఆమోదించిన కురుమ, యాదవ కార్పొరేషన్‌నీ కురుమలందరూ వ్యతిరేకిస్తున్నారని తెలిపారు. ఈ సమావేశంలో మండల కురుమ సంఘం ఉపాధ్యక్షుడు చుక్క అశోక్, ప్రధాన కార్యదర్శి కూకట్ల శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యాన్ని తరలించిన డీలర్‌పై విచారణ

మిరుదొడ్డి,మార్చి16: అక్బర్‌పేట-భూంపల్లి మండలం రుద్రారం గ్రామంలో రెండు రోజుల క్రితం రేషన్‌డీలర్ నాగభూషణం షాపు నుంచి పీడీఎస్ బియ్యాన్ని తరలించిన విషయం తెలిసిందే. శనివారం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు డిప్యూటి తహసీల్దార్ రాజరెడ్డి గ్రామంలో విచారణ చేపట్టారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

చిన్నకోడూరు, మార్చి 16 : సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ బాలకృష్ణ సూచించారు. మండలంలోని సికింద్లాపూర్ గ్రామంలో శుక్రవారం రాత్రి పోలీసు కళాబృందంతో కనువిప్పు కార్యక్రమం నిర్వహించారు.

జగదేవ్‌పూర్ నూతన ఎంపీడీవోగా యాదగిరి

జగదేవ్‌పూర్, మార్చి 16: జగదేవ్‌పూర్ మండల నూతన ఎంపీడీఓగా యాదగిరి శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన పట్టాభిరామారావు బదిలీపై నాగర్‌కర్నూల్ జిల్లాకు బదిలీపై వెళ్లారు.

దుబ్బాక అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తా

● దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి

తొగుట, మార్చి 16: దుబ్బాక నియోజకవర్గ అభివృద్ధి కోసం శక్తివంచన లేకుండా కృషి చేస్తానని దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం రూ. 75 లక్షల నిధులతో తొగుట మండలంలో పలు అభివృద్ధి పనులకు ఆయన భూమి పూజచేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడారు. మహిళ సంఘాలకు వడ్డీలేని రుణాలు ఇస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ తొగుట ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో సీఎం చిత్రపటానికి ఆయన క్షీరాభిషేకం చేశారు. అంతకు ముందు బీఆర్ఎస్ పార్టీకి చెందిన మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ దేవునూరి పోచయ్య పార్టీకి రాజీనామా చేసి శ్రీనివాస్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరగా, ఆయనకు పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అక్కం స్వామి, మాజీ సర్పంచ్‌లు చెరుకు విజయ్‌రెడ్డి, కొండల్‌రెడ్డి పాల్గొన్నారు.



తొగుట: తుక్కాపూర్ ప్రాథమిక పాఠశాల ప్రహరీ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి

దుబ్బాక/మిరుదొడ్డి/రాయపోల్,మార్చి16: సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం కృషిచేస్తున్నదని చెరుకు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం మిరుదొడ్డి మోడల్ స్కూల్‌లో ఆర్‌వో వాటర్ ప్లాంట్‌ను‌ప్రారంభించడంతోపాటు దుబ్బాకలోని కస్తూరిబాగాంధీ బాలికల విద్యాలయ ప్రహరీగోడ, బల్వంతాపూర్ గ్రామంలోని ప్రాథమిక పాఠశాల ప్రహరీ గోడనిర్మాణానికి భూమిపూజను చేశారు. ఆయన వెంట కాంగ్రెస్‌పార్టీ నాయకులు పాఠశాల ప్రధానోపాధ్యాయులు భారతి, స్వాతి తదితరులున్నారు. దుబ్బాక నియోజకవర్గంలోని గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పన కోసం కృషి చేస్తానని శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం ఆయన రాయపోల్ మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించి అభివృద్ధి పనులను ప్రారంభించారు.

పాఠశాలను తనిఖీ చేసిన డీఈవో



డీఈవోను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

సిద్దిపేట అర్బన్, మార్చి 16 : సిద్దిపేట అర్బన్ మండలం నాంచార్ పల్లి ప్రాథమికోన్నత పాఠశాలను సిద్దిపేట డీఈవో శ్రీనివాస్‌రెడ్డి శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలోని అన్ని తరగతులకు వెళ్లి విద్యార్థుల స్థాయిని పరిశీలించారు. అలాగే పాఠశాల నిర్వహణ రికార్డులను తనిఖీ చేసి పలు సూచనలు ఇచ్చారు. డీఈవోను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయులు సన్మానించారు.

కొమ్మూరికి పార్లమెంట్ టికెట్ ఇవ్వాలి

కొమురవెల్లి, మార్చి 16 : జనగామ డీసీసీ అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాపరెడ్డికి భువనగిరి పార్లమెంట్ టికెట్ ఇవ్వాలని కొమురవెల్లి, చేర్యాల, మద్దూరు, దూల్మిట్ట మండలాల కాంగ్రెస్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం కొమురవెల్లిలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. జనగామ ప్రాంత బిడ్డ కొమ్మూరికి ఎంపీ టికెట్ ఇస్తే 50వేల మెజారిటీతో గెలిపిస్తామని, సీఎం రేవంత్‌రెడ్డితో పాటు, పార్టీ అధిష్ఠానానికి విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మద్దూరు జడ్పీటీసీ గిరి కొండల్‌రెడ్డి, మల్లన్న ఆలయ పునరుద్ధరణ కమిటీ చైర్మన్ లక్ష్మారెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మహాదేవుని శ్రీనివాస్, ఎంపీటీసీ కవితా కనకరాజు, మాజీ సర్పంచ్ రమణారెడ్డి, నాయకులు చొప్పరి మల్లేశం, చెట్కూరి కమలాకర్, మల్లం బాలయ్య, కామిడి జీవన్‌రెడ్డి, పుట్ట రమేష్, కిషోర్, మల్లం శేఖర్ శ్రీనివాస్, పలు మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాష్ట్రాన్ని ఇచ్చిన కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం

● కాంగ్రెస్‌సిద్దిపేట పట్టణ అధ్యక్షుడు అత్తుఇమామ్

సిద్దిపేటటౌన్, మార్చి16: తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన కాంగ్రెస్‌నే అభివృద్ధి సాధ్యమవుతుందని కాంగ్రెస్ సిద్దిపేట పట్టణ అధ్యక్షుడు అత్తుఇమామ్ అన్నారు. సిద్దిపేటలో శనివారం మున్సిపల్ కమిషనర్ కే.ప్రసన్నరాణితో కలిసి కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ 8, 9, 10, 40వ వార్డుల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారన్నారు. కార్యక్రమంలో 8వ వార్డు కౌన్సిలర్ వరాల కవిత, నాయకులు కలీమొద్దీన్, మంద పాండు, గోపి కృష్ణ గయాజుద్దీన్, వహాబ్, నజ్జు, ఫయాజ్, ఇమ్రాన్ అలి, మున్నా, నవాజ్ పాల్గొన్నారు.



సిద్దిపేటలో సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న పూజల హరికృష్ణ

బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో తెలంగాణ విధ్వంసం

చేర్యాల/మద్దూరు మార్చి 16 : బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో తెలంగాణ విధ్వంసానికి గురైందని, ప్రజాపాలనతో సీఎం రేవంత్ రెడ్డి ప్రజల జీవితాలలో వెలుగులు నింపుతున్నారని జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి అన్నారు. చేర్యాల మునిసిపల్ 5వార్డు పరిధిలోని బీడీకాలనీలో ఎస్‌డీఎఫ్ నిధులు రూ.5లక్షల వ్యయంతో చేపట్టిన సీసీరోడ్డు నిర్మాణం పనులు శనివారం ఆయన ప్రారంభించారుకార్యక్రమంలో కౌన్సిలర్‌లు ఆడెపు నరేందర్, చెవిటి లింగం, తుమ్మలపల్లి లీల, పట్టణాధ్యక్షుడు చిరంజీవులు పాల్గొన్నారు. మద్దూరు మండలం లద్నూరులో ఎస్‌డీఎఫ్ నిధులు రూ.కోటితో పార్మేషన్ రోడ్డు నిర్మాణానికి శనివారం జడ్పీటీసీ గిరి కొండల్‌రెడ్డి, స్థానిక నాయకులతో కలిసి మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో కామిడి జీవన్‌రెడ్డి, మేక మల్లేశం, కామిడి రమేష్‌రెడ్డి, రాగుల శ్రీనివాస్‌రెడ్డి, రామడుగు బాలరాజ్, దాసరి పద్మారెడ్డి, సందిటి లక్ష్మి, జీడికంటి సురేష్ పాల్గొన్నారు.



బీడీకాలనీలో పనులు ప్రారంభిస్తున్న కొమ్మూరి

అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎంపీ

బెజ్జంకి, మార్చి 16 : బీజేపీ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రజాహిత యాత్రలో భాగంగా శనివారం బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ బెజ్జంకి మండలంలో పర్యటించి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. మండలంలోని లక్ష్మీపూర్, బేగంపేట, గుండారం బెజ్జంకి దాచారం గ్రామాల్లో బండి సంజయ్ ప్రజాహిత యాత్రను కొనసాగించారు. ఈ సందర్భంగా అయా గ్రామాల్లో ఎంపీ నిధుల ద్వారా చేపట్టిన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసి, పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ కవిత, సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు గంగిడి మోహన్‌రెడ్డి, కిసాన్ మోర్చ రాష్ట్ర కార్యదర్శి మహిపాల్‌రెడ్డి, మండల అధ్యక్షుడు కొలిపాక రాజు, రాష్ట్ర నాయకులు చాడ వెంకటరెడ్డి, అనిల్ రావ్, రాజు, రవి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం అదుపుతప్పి వ్యక్తి మృతి



చంద్రమౌళి (ఫైల్)

కొమురవెల్లి ,మార్చి 16 : ద్విచక్ర వాహనం అదుపుతప్పి కింద పడడంతో ఓ మృతిచెందాడు. ఈ సంఘటన కొమురవెల్లి శివారులో శుక్రవారం రాత్రి చోటుచేసుకున్నది. కొమురవెల్లి ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. చేర్యాల మండలం చిట్యాల గ్రామానికి చెందిన చంద్రమౌళి (53)సిద్దిపేటలో సెంట్రింగ్ పని చేస్తూ జీవిస్తున్నాడు. శుక్రవారం చేర్యాల మండలం పోతిరెడ్డిపల్లి గ్రామంలో తన సోదరి ఇంటికి వెళ్లాడు. తిరిగి సిద్దిపేటకు వెళ్తుండగా కొమురవెల్లి శివారులో ద్విచక్ర వాహనం అదుపుతప్పి రోడ్డుపై పడిపోవడంతో స్థానికులు 108లో సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడి కుమారుడు పోలోజు రాజేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

చిన్నకోడూరు, మార్చి 16 : విద్యుదాఘాతంతో రైతు మృతి చెందిన సంఘటన మండలంలోని అనంతసాగర్ గ్రామంలో శనివారం చోటుచేసుకున్నది. ఎస్ఐ బాలకృష్ణ, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మెంగళ లక్ష్మయ్య (54) వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. శనివారం ఉదయం అతను నీళ్లు పెట్టడానికి పొలానికి వెళ్లాడు. స్టార్టర్ నుంచి బోరుకు ఉన్న విద్యుత్ తీగ కట్ అయి ఉండటాన్ని గమనించి లక్ష్మయ్య దాన్ని సరిచేసే క్రమంలో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుమారుడు రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చెరువులో పడి యువకుడి మృతి

సిద్దిపేట క్రైం, మార్చి 16: ఈత కొట్టడానికి చెరువులోకి దిగిన యువకుడు మృతిచెందిన సంఘటన సిద్దిపేటలో శనివారం వెలుగుచూసింది. సిద్దిపేట పట్టణం గాంధీనగర్‌కు చెందిన కెమ్మసారం రాజు(25) శుక్రవారం పట్టణంలోని కోమటిచెరువులో ఈత కొట్టడానికి వెళ్లాడు. ఈ క్రమంలోనే అతడు ప్రమాదవశాత్తు చెరువులో మునిగి మృతిచెందాడు. శనివారం ఉదయం చెరువులో మృతదేహం తేలి ఉండడాన్ని గుర్తించి గజ ఈతగాళ్లతో బయటకు తీయించారు. మృతుడి తండ్రి పోచయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆటో, బైక్ ఢీకొని ఒకరికి తీవ్ర గాయాలు

రాయపోల్, మార్చి 16: ఆటో, బైక్ ఎదురెదురుగా ఢీకొనడంతో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడిన సంఘటన రాయపోల్‌లో శనివారం చోటుచేసుకున్నది. దౌల్తాబాద్ మండలం షేర్‌పల్లి బందారం గ్రామానికి చెందిన నాగరాజు ద్విచక్ర వాహనంపై కూతురు వైష్ణవి, భార్య బాల్‌లక్ష్మీతో కలిసి గజ్వేల్ వైపు వెళ్తున్నాడు. రాయపోల్‌లోని ఫంక్షన్‌హాల్ వద్దకు రాగానే గజ్వేల్ మండలం జాలిగామకు చెందిన ఆటో గజ్వేల్ నుంచి రాయపోల్ వైపు వెళ్తూ బైక్‌ను ఢీకొట్టింది. దీంతో నాగరాజుకు తీవ్ర గాయాలయ్యాయి. ఆయన కుమార్తెకు స్వల్ప గాయాలయాలు కాగు వెంటనే వారిని 108లో గజ్వేల్‌లో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

కుంగిన రోడ్డుకు మరమ్మతులు

● ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన

చేర్యాల, మార్చి 16 : పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు ఆవరణలో కల్వర్టువద్ద కుంగిన రోడ్డుకు మరమ్మతులు చేపట్టారు. జనగామ-సిద్దిపేట జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా కొద్దిరోజులక్రితం బస్టాండు ఆవరణలో నిర్మించిన కల్వర్టుకు ఇరువైపులా బీటీరోడ్డు కుంగడంతో, ప్రమాదాలు చోటుచేసుకుని ప్రయాణికులు గాయాలపాలవుతున్న విషయమై శుక్రవారం ఆంధ్రజ్యోతిలో ప్రత్యేక కథనం ప్రచురితమైంది. ఈమేరకు సంబధిత అధికారులు స్పందించి శుక్రవారం కల్వర్టుకు ఇరువైపులా బీటీవేసి సరిచేశారు.

చెరువులు, కుంటలను నీటితో నింపాలని ధర్నా

కొండపాక, మార్చి 16 : కొండపాక మండలంలోని అన్ని గ్రామాల చెరువులను, కుంటలను కాలువల ద్వారా నీరు నింపాలని సీపీఎం ఆధ్వర్యంలో కొండపాక మండల కార్యాలయం ఎదుట శనివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు మాట్లాడుతూ.. తపాస్‌పల్లి రిజర్వాయర్ నుంచి మండలంలోని చెరువులకు, కుంటలకు కాలువల ద్వారా నీరు నింపాలని, కాలువల్లేని ప్రాంతాల్లో కాలువల నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి అమ్ముల బాల నరసయ్య, సీపీఎం మండల కమిటీ సభ్యుడు కొమురవెల్లి కనకయ్య తాటోజు రవీంద్రచారి, జె.ప్రభాకర్, రైతు సంఘం మండల కార్యదర్శి కనకాచారి నాయకులు అయిలయ్య, కొమురయ్య, నర్సయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.

కుట్టుమిషన్ల పంపిణీ



కుట్టుమిషన్లు అందజేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ మంజులరాజనర్సు

సిద్దిపేట టౌన్, మార్చి16: మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆదేశాల మేరకు సిద్దిపేట పట్టణంలోని 2, 31వ వార్డులలో ఉచితంగా కుట్టుమిషన్ శిక్షణ పొందిన 100మంది మహిళలకు మున్సిపల్ కమిషనర్ ప్రసన్నరాణి, మున్సిపల్ వైస్ చైర్మన్ జంగిటి కనకరాజుతో కలిసి సిద్దిపేట మున్సిపల్ చైర్‌పర్సన్ మంజులరాజనర్సు కుట్టు మిషన్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ నాయిని చంద్రం, మున్సిపల్ మాజీ చైర్మన్ కడవేరుగు రాజనర్సు, పలువురు పట్టణ కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, మున్సిపల్ అధికారులు సాయి కృష్ణ, రమ్య జ్యోతి, పలు వార్డుల ఆర్పీలు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే వికాసం, విజయం

● జిల్లా సెక్టోరియల్ అధికారి రంగానాథ్

దౌల్తాబాద్,మార్చి16: విద్యతోనే వికాసం, విజయం దక్కుతుందని జిల్లా సెక్టోరియల్ అధికారి రంగానాథ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలను, లింగరాజుపల్లి ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా సందర్శించారు. కేజీబీవీ దౌల్తాబాద్ పాఠశాలలో పదోతరగతి విద్యార్థులతో ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్య అందుతున్నదని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శేషాద్రి, వెంకటలక్ష్మి, పరమేశ్వరి, రజిని, కేజీబీవీ ప్రత్యేకాధికారి రాధిక, మమత, ఉపాధ్యాయులు, సీఆర్పీ రాజు, నగేష్, తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం పట్టివేత

వర్గల్, మార్చి 16 : ట్రాలీ ఆటోలో అక్రమంగా తరలిస్తున్న 7 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని టాస్క్‌ఫోర్స్, గౌరారం పోలీసులు పట్టుకున్నారు. ఈ సంఘటన శనివారం వర్గల్ మండలం మైలారం వద్ద చోటుచేసుకున్నది. ట్రాలీ ఆటోతో పాటు అందులో ఉన్న 7 క్వింటాళ్ల పీడీఎస్ రైస్‌ను స్వాధీనం చేసుకుని బియ్యాన్ని తరలిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. సంఘటనకు సంబంధించి టాస్క్‌ఫోర్స్ సీఐ జానకిరాంరెడ్డి, గౌరారం పోలీసులు అందించన వివరాలు ఇలా ఉన్నాయి. గజ్వేల్ ఆర్ అండ్ ఆర్ కాలనీ వేములగట్‌కు చెందిన ఎల్లేడ్ తిరుపతి ఏపీ36డబ్ల్యూ3466 నెంబర్ ఆటో ట్రాలీలో శనివారం అక్రమంగా రేషన్ బియ్యాన్ని తరలిస్తున్నాడు. వర్గల్ మండలం మైలారం మీదుగా గజ్వేల్ వైపు వస్తుండగా, సమాచారం అందుకున్న సిద్దిపేట టాస్క్‌ఫోర్స్ పోలీసులు, గౌరారం పోలీసులు తనిఖీ చేసి ఆటోలో ఉన్న 7 క్వింటాళ్ల పీడీఎస్ రైస్‌ను పట్టుకుని గౌరారం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

దూళిమిట్టలో పోషణ పక్షోత్సవం

దూళిమిట్ట,మార్చి16: పోషణ పక్షోత్సవ సందర్భంగా శనివారం దూళిమిట్ట మండలంలోని అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ పక్షోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా భైరాన్‌పల్లి సెక్టార్ సూపర్‌వైజర్ పుష్పలత మాట్లాడుతూ.. గర్భిణీ స్త్రీలు, బాలింతలు మిల్లెట్స్ తినడం వల్ల కలిగే లాభాలు వివరించారు.